క్లుప్తంగా

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి



మాగనూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఏఎంవో (అకాడమిక్ మానిటరింగ్ అధికారి) విద్యాసాగర్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని కొత్తపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. పాఠ్యాంశాలను విద్యార్థులతో చదివించారు. పలు ప్రశ్నలు వేసి వారి నుంచి జవాబులు రాబట్టారు. ఆనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి, నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోండి



నారాయణపేట/మక్తల్: జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని గురువారం పట్టణంలో ముదిరాజ్ భవనం దగ్గర ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మత్స్యకార కమిటీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య సహకార జిల్లా మాజీ చైర్మన్ కోళ్ల వెంకటేశ్, చందపూర్ శేఖర్, తిరుపతి నర్సింములు, ఆంజనేయులు, కిష్టప్ప, నర్సింములు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



మక్తల్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని అధికారులు సూచించారు. మండంలోని జక్లేర్, మాగనూర్, కృష్ణ మండలాల్లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు కళాజాత ద్వారా మహిళా సంఘాల ప్రాధాన్యతను వివరించారు. పొదుపు మహిళలు ఇన్సూరెన్స్ తీసుకుంటే రూ.2 లక్షల వరకు బీమా వర్తింస్తుందని, ప్రమాదంలో మరణించిన వారికి రూ.10 లక్షల వరకు బీమా సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కళాకారులు రవివంకర్, కిరణ్ బాలయ్య అరుణ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ వికాశ్ బ్యాంక్ దగ్గర ఇందిరమ్మ మహిళా శక్తి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మహిళల కోసం అమలుచేస్తున్న పథకాల గురించి ఏపీఎం మహిళలకు వివరించారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

నారాయణపేట రూరల్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు శారద కోరారు. గురువారం సింగారం చౌరస్తాలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. వర్షాకాలం పల్లెల్లోని మురుగు కాలువలను తరచూ శుభ్రపరచాలని, నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మి, మంజుల, సావిత్రమ్మ, నరసమ్మ, పద్మమ్మ, నరసింహ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలి

నారాయణపేట రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా నాయకులు రాజు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసన సభ్యురాలు పర్ణికారెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం–2018ను మార్చాలని, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపతి, లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. సమస్యల ఒడి

- ప్రైవేటు భవనంలోకి మార్చిన ఉపాధ్యాయులు
- మధ్యాహ్న భోజనం మాత్రం శిథిల భవనంలోనే
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



పైకప్పు పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన పాఠశాల

కృష్ణా: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడుల్లో కూడా మెరుగైన విద్యను బోధిస్తున్నట్లు ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనపై మాత్రం దృష్టి పెట్టడం లేదు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం పైకప్పు పెచ్చులూడి అధ్వానంగా తయారైంది. కొన్ని తరగతి గదుల్లో పైకప్పు మొత్తం ఊడిపడడంతో ఎక్కడ చూసినా స్టీల్ రాడ్‌లు విరిగిపోయి కనిపిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రధానోపాధ్యాయులు మండల కేంద్రంలోని రైతు వేదికలో తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. కాని ఆ రైతు వేదిక భవనం ఇచ్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధంగా లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితులలో స్థానికంగా ఉన్న ఓ వ్యాపారి భవనంలోని రెండో అంతస్తులో తరగతులను నిర్వహిస్తున్నారు. ఇక మధ్యాహ్న భోజనం మాత్రం శిథిల భవనంలోనే కొనసాస్తున్నారు. ఇలా ప్రతి రోజు అక్కడి నుంచి



ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న పాఠశాల

ఇక్కడకు, ఇక్కడి నుంచి అక్కడకు వెళ్లాలంటే చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలలో మొత్తం ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 62 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలకు సరైన భవనం లేకపోవడంతో రోజురోజుకు పాఠశాలలోని విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పాఠశాలను ఎమ్మార్సీ భవనంలోకి మార్చుతాం



మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం కొనసాగుతుంది. వారు ఆ భవనం ఖాళీ చేసిన వెంటనే అక్కడికి ఈ పాఠశాలను మార్చుతాం. ఇటీవల నూతనంగా నిర్మాణమైన భవనంలోకి ఎంపీడీఓ కార్యాలయాన్ని మార్చాలని ఇప్పటికే జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. వారు వెంటనే ఖాళీ చేసేలా చూడాలని ఎంపీడీఓను పలుమార్లు కోరాం. వారంలోపు పాఠశాలను మార్చి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

–నిజాముద్దీన్, ఎంఈఓ, కృష్ణా మండలం

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

పాఠశాల భవనం ప్రమాదకర పరిస్థితిలో ఉండడం మూలంగా అక్కడి నుంచి ఇతర భవనంలోకి మార్చాలని గత విద్యా సంవత్సరంలోనే అప్పటి అదనపు జిల్లా కలెక్టర్ గరీమ నరుల్ల మండల విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. ఎంఈఓ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులను ప్రైవేటు భవనంలోకి మార్చారు. మార్చడం వరకు బాగానే ఉంది కానీ మధ్యాహ్న భోజనాలకు మాత్రం విద్యార్థులను శిథిలావస్థకు చేరిన భవనంలోకి తీసుకెళ్తుండడంపై ఉపాధ్యాయులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యావ్యవస్థ సమస్యలు పరిష్కరించాలి



నారాయణపేట రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పీఆర్టీయూ సంఘం పని చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని కోటకొండ, జాజాపూర్, కొల్లంపల్లి జడ్పీ స్కూల్, తిరుమలాపూర్, బండగొండ, అభంగాపూర్, చిన్నజట్రం తదితర యూపీఎస్ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి ఫలితాల కోసం ప్రభుత్వం విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను, పీఆర్సీ, ఈహెచ్ఎస్‌లను ప్రకటించి, బదిలీలతో కూడిన ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రఘువీర్, కార్యదర్శి మాల్గాన్ జనార్దన్, మహేష్ కల్యాణి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి



ఊట్కూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకుడు కోరం శివరాజురెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం మానుకొని ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపించాలని కోరారు. షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మీ చెక్కులతో పాటు అర్ధతులం బంగారం ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదని ఆరోపించారు. వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12వేలు అలాగే మహాలక్ష్మీ పథకంలో ప్రతి మహిళకు రూ.2500 వెంటనే ఇవ్వాలని కోరారు. ఇప్పటికైన కాంగ్రెస్ నాయకులు ప్రజల సంక్షేమానికి పాటుపడాలన్నారు. సమావేశంలో నాయకులు కాలిక్, గంగాధర్ పాల్గొన్నారు.

కల్వర్టును ప్రారంభించిన ఎమ్మెల్యే



కల్వర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మరికల్: మండలంలో పైపులు వేసి నిర్మించిన కల్వర్టును గురువారం ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రారంభించారు. నాయిబ్రాహ్మణ శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో మంగలోని వంపు ఉండటంతో నీళ్లు నిలిచి అంతిమయాత్రకు ఇబ్బంది కలుగుతుందని స్థానికులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.1.50 లక్షలు మంజూరు చేయించి కల్వర్టు నిర్మించి సమస్యను తీర్చారు. సమస్య తీరడంతో ఎమ్మెల్యేకు నాయి బ్రాహ్మణులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, కృష్ణయ్య, వినితమ్మ, గోపాల్, గోవర్ధన్, రామకృష్ణారెడ్డి, రఘు, గోపాల్, నర్సింములు, శివకుమార్, అశోక్, వేణు, బాల్‌రాజ్, బీషులు, పాపరాయుడు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్‌రెడ్డి

మాగనూర్: పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలో కొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డిని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయాలని, తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించి రికార్డులను క్రమం తప్పకుండా మెయింటెనెన్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



ఓబులాపూర్‌లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న అధికారులు

మక్తల్: మక్తల్ మున్సిపల్ పరిధిలోని చందపూర్ గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం విడతల వారిగా రూ.5 లక్షలు చెల్లింస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలి

ఊట్కూరు: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ డీఈ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారందరూ నిర్మాణ పనులు చేపట్టాలని విడతల వారిగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని తెలిపారు. తర్వాత లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

మాగనూర్: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేసి నిర్మాణాలను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

సాక్షి నెట్‌వర్క్: గురుపౌర్ణమిని పురస్కరించుకొని సాయినాథుడి మందిరాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం, సాయి అష్టోత్తర శతనామావళీ, సాయి భజనలు నిర్వహించి సాయిబాబను దర్శించుకున్నారు.

■ నారాయణపేటలో బీజేపీ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. స్థానిక సిటిజన్ క్లబ్‌లో యోగా గురువు సురేష్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండలం, పట్టణ అధ్యక్షుడు వినోద్ కుమార్, జ్యోతి సాయిబన్న, శివప్ప, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, కార్తీక్, సత్యనారాయణ, మహేంద్ర పాల్గొన్నారు.

■ మక్తల్‌లో శ్రీపడమటి ఆంజనేయస్వామి, శ్రీమల్లికార్జున స్వామి, సత్యసాయి భగవాన్, శిరిడి సాయి మందిరాల్లో స్వామివారికి అభిషేకం, పుష్కర స్నానం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



మక్తల్‌లో సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వాకిటి లలిత

పట్టణంలోని సాయిబాబా ఆలయంలో మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలిత పూజలు జరిపించారు.

■ నర్వలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సంజన్న, బోయ వెంకటయ్య, నాగరాజు, హన్మంతు, నర్సింములు, లింగప్ప, నరేష్ పాల్గొన్నారు.

■ దామరగిద్దలో సూర్యనంది క్షేత్రంలోని మాత మాణికేశ్వరి ఆలయంలో భజనలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు మాత సమాధిని దర్శించుకున్నారు.

■ ధన్వాడలోని సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే మాజీ వార్డు సభ్యులు కృష్ణయ్య ఇంట్లో గురువులను పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

■ ఊట్కూరులోని నిడుగుర్తిలో సాయిబాబా దేవాలయంలో కాగడహారతి, భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు శ్రీనివాస్‌గౌడ్, గీతా శ్రీనివాస్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, నరేష్, శివ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ మద్దూరులోని సాయినాథుడి మందిరంలో స్వామి వారికి పల్లకి సేవ, అభిషేకం, భజనలు కాగడ హారతి నిర్వహించారు. మాజీ ఎంపీపీ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు.



దామరగిద్దలోని ఆలయంలో భక్తుల పూజలు



నిడుగుర్తిలో పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు



గురువును సన్మానిస్తున్న నాయకులు

స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలి



కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించాల్సిన పెండింగ్ స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందించారు. పదేళ్లు పాలించిన కేసీఆర్ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారని అదే బాటలో రేవంత్ రెడ్డి నడవడం సరికాదన్నారు. 15 శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని ప్రకటించి 7 శాతానికే పరిమితం చేయడం బాధకరమన్నారు. జిల్లా కేంద్రంలోని పీహెచ్ఈఎస్ పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశపెట్టాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపించి సమయానికి విద్యాసంస్థలకు చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సాయికుమార్, కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షులు గౌడ్, వెంకటేష్, మహేష్, గణేష్, సురేష్, కృష్ణ, రాజు, అంజి, పరశురాం, అక్షయ, నవిత, అక్షిత, వైష్ణవి, అరుణ, జయ శ్రీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



16వ వార్డులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఎదుగుతామని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం పట్టణంలోని 16వ వార్డులో తడి–పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. వస్తువుల వినియోగానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలన్నారు. అమృత్‌జల్ పథకం ద్వారా ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే 'తపస్' లక్ష్యం

నారాయణపేట రూరల్: నిరంతరం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తూ వారి సంక్షేమమే ధ్యేయంగా తపస్ పని చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు షేర్ కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని గ్రౌండ్, బాలికల ఉన్నత పాఠశాలలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యారంగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మండలిలో ఉపాధ్యాయ గొంతుకగా ఇద్దరు ఎమ్మెల్సీలను గెలిపించుకున్నామని, అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తారన్నారు. పోరాటాలతోనే సమస్యలను సాధించుకున్నామని, భవిష్యత్‌లోనూ టీచర్ల కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దత్తు రావు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ, నాయకులు శ్యామ్, నర్సప్ప, రవికుమార్, శ్రీహరి, మల్లేష్, భీమేశ్వరి, నరేష్, కృష్ణారెడ్డి, జానకి, మల్లేష్, మౌనిక, నవ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీ సరికాదు

నారాయణపేట రూరల్: ఆర్టీసీ కార్మికుల నుంచి శ్రమదోపిడీ చేయడం సరికాదని టీఎంయూ డిపో సెక్రెటరీ మధుసూదన్ విమర్శించారు. డిపోలో నాలుగు సర్వీసుల కిలోమీటర్లు పెంచడాన్ని నిరసిస్తూ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ అలివేలమ్మకు గురువారం వినతిపత్రం అందించారు. 466 కిలోమీటర్ల హైదరాబాద్ ఎక్స్ ప్రెస్ సర్వీసును 664 కిలోమీటర్లకు పెంచడాన్ని తప్పుబట్టారు. వరుసగా 23 గంటల పాటు డ్యూటీలో ఉండాలంటే డ్రైవర్, కండక్టర్ల ఆరోగ్య పరిస్థితి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా సర్వీస్ షెడ్యూల్‌లను రూపొందించడం మానుకోవాలన్నారు. వెంటనే పాత షెడ్యూల్ ప్రకారమే ఆయా సర్వీసులను నడిపించాలని, లేకపోతే లేబర్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సురేష్, రాజు, మోహన్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు పండుగ



ఊట్కూరు: పట్టణంలోని భవానీ మందిర్‌లో గురువారం ఆషాడ పౌర్ణమి సందర్భంగా మహిళలు గోరింటాకు పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా భవానీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహికంగా గోరింటాకు పెట్టుకొని సందడి చేశారు. కార్యక్రమంలో యస్ఖ్వీ సమాజ్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, మహిళలు రాధా ప్రకాష్, అంబుబాయ్, రశ్మి, శారద, లలిత, కళావతి పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత

నర్వ: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అన్నారు. గురువారం లంకాల్ గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్ తండ్రి దూల వెంకటన్నకు రూ.5 లక్షల ఎల్ఓసీ అందజేశారు. అరుణ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవడంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు.

పంటల పిచికారీకి భగీరథ నీళ్లు



మరికల్: మండలంలోని పస్పుల గ్రామానికి తాగునీరు అందించే మిషన్ భగీరథ నీటిని పంటల పిచికారీ కోసం వినియోగించడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓ రైతు పత్తి పంటకు తెగుళ్లు సోకకుండా మందు పిచికారీ చేయడానికి ట్యాంకులోకి భగీరథ నీరును పట్టుకున్నాడు. ఏకంగా భగీరథ ట్యాంకు నుంచి పైపు ద్వారా ట్యాంకులోకి నీళ్లు ఎక్కించడం వల్ల తాగునీరులో క్రిమిసంహారక మందు చేరే ప్రమాదం ఉందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి భగీరథ ట్యాంకు నుంచి మందుల పిచికారి కోసం నీళ్లను వాడుకోవడాన్ని నిషేధించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలుచేయాలి



నారాయణపేట రూరల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రణ చట్టం అమలు చేసి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణ పురవీధుల గుండా ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాలయాల్లో ఇష్టారీతిగా ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఇబ్బందుల గురి చేస్తున్నారని విమర్శించారు. కళాశాలలో చదువుకునే విద్యార్థుల స్కాలర్షిప్ లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించి నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ మంజూరు

ధన్వాడ: మండలంలోని గున్ముక్ల గ్రామానికి ఎంపీ నిధుల నుంచి మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ మంజూరైనట్లు బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామానికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేసినందుకు ఎంపీ డీకే అరుణకు గ్రామస్తులందరూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామపెద్దలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ మండల కమిటీ ఎన్నిక

కోస్గి: ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా పాశం విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఇజాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా మాసాయపల్లి కృష్ణ, కోశాధికారిగా మల్లేష్, గౌరవ అధ్యక్షుడిగా వహిద్, కార్యదర్శులుగా హన్మాన్‌పల్లి రాజు, సంపల్లి రాజు, ప్రచార కార్యదర్శిగా ముశ్రీఫా రవి, సలహాదారుగా అజయ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సుధా స్టూడియో శ్రీను, స్వాతి స్టూడియో కృష్ణ, హన్మంతుతో పాటు పలు గ్రామాల ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.